చలానాలకు చిక్కం

నగరంలో కొత్తగా ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి రావడంతో వాహనదారులు సిగ్నల్స్ వద్ద చలానాలకు చిక్కకుండా స్టాప్‌లైన్‌కు ముందుగానే వాహనాలను ఆపుతున్నారు. శనివారం కూకట్‌పల్లి వైజంక్షన్ వద్ద కనిపించిన దృశ్యం

హైదరాబాద్ వార్త

కేబుల్ బ్రిడ్జికి అరుదైన గుర్తింపు

మౌలిక సదుపాయాల కల్పనలో రెండో స్థానం

హైదరాబాద్, అక్టోబరు 8 ప్రభా తవార్త : అత్యాధునిక సాంకే తిక పరిజ్ఞానంతో ఐటీ కారిడార్ లోని దుర్గం చెరువుపై నిర్మించిన కేబుల్ వంతెనకు అరుదైన గుర్తింపు దక్కింది. ఇండియన్ చాప్టర్ ఆఫ్ అమెరికా ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ కాంక్రీట్ (ఏఐసీ) ఆధ్వర్యంలో మౌలిక సదుపా యాల కల్పన కేటగిరిలో రెండో స్థానంలో నిలిచింది. నిర్మాణ సంస్థ (ఎల్‌అండ్‌టీ) ప్రతినిధులు ఈ మేరకు ఎక్సలెన్స్ ఇన్ కాంక్రీట్ కన్‌స్ట్రక్షన్ అవార్డు 2021ను అందుకున్నారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ)లో భాగంగా దుర్గం చెరువుపై రూ.184 కోట్ల వ్యయంతో ఈ వంతెన నిర్మించారు. ఎక్‌ట్రా డోస్ ఇంజనీ రింగ్ పరిజ్ఞానంతో నిర్మించిన వంతెన రెండేళ్లత క్రితం అందుబాటులోకి వచ్చింది. ఏసియాలోనే అతి పెద్ద స్పాన్‌తో నిర్మించిన వంతెన ఇదే అని అధికారులు గతంలో ప్రకటించారు. వంతెన పొడవు 425.85 మీటర్లు కాగా, అప్రోచ్ రోడ్లతో కలిపి 764.38 మీటర్లు. వాహనాల రాకపోకల కోసమే కాకుండా, పర్యాటక ప్రాంతంగా ప్రభుత్వ విభాగాలు వంతెనను అభివృద్ధి చేశాయి. నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన భాగ్యనగర సిగలో ఆధునిక ఐకానిక్ స్ట్రక్చర్‌గా కేబుల్ వంతెన చేరింది. ఫుట్‌పాత్, సైక్లింగ్ ట్రాక్ వంతెనపై ఉన్నాయి. ప్రత్యేక సందర్భాల్లో ప్రదర్శించేందుకు 25 రకాల థీమ్‌లతో లైటింగ్ ఏర్పాటు చేశారు.

కాళేశ్వరం గోదావరి నది నుంచి

మరో మృతదేహం వెలికితీత

రామ్‌నగర్‌కు చేరుకున్న రెండు మృతదేహాలు

వినోద్ మృతదేహాన్ని వెలికితీసిన దృశ్యం

చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాత వార్త: హైదరాబాద్ నగరంలోని రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు కాళేశ్వరం గోదావరి నదిలో శుక్రవారం గల్లంతైన మరో మృతదేహాన్ని జాలర్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. ముషీరాబాద్ నియో జకవర్గంలోని రామ్‌నగర్ ప్రాం తానికి చెందిన ఆటోడ్రైవర్ రవీం దర్ కుమారుడు వినోద్(21), అదే ప్రాంతానికి చెందిన పెయింటర్ నర్సింగరావు కుమారుడు పవన్(20)లతో పాటు మరికొంత మంది రామ్‌నగర్‌లో దుర్గామాత ఉత్సవాలు పూర్తి కావడంతో అమ్మవారిని నిమజ్జనం చేయడానికి కాళేశ్వరంకు వచ్చి వీరిరువురు గల్లంతైన విషయం తెలిసిందే. కాళేశ్వరం పోలీసుస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు పర్యవేక్షణలో శుక్రవారం వినోద్ మృతదేహాన్ని వెలికితీసిన జాలర్లు వినోద్ మృతదేహాన్ని శనివారం గాలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. దీంతో రెండు మృతదేహాలను వెలికితీసినట్లయింది. కాటారం డిఎస్‌పి మోహన్‌రెడ్డి, మహదేవ్‌పూర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ పర్యవేక్షణలో పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహించారు.

మిలాద్-ఉన్-నబీకి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

నగర సిపి, సి.వి. ఆనంద్

సమావేశంలో పాల్గొన్న సిపి సి.వి.ఆనంద్, పలువురు ముస్లిం మత ప్రముఖులు

చార్మినార్, అక్టోబరు 8 ప్రభాతవార్త : మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ అన్నారు. మిలాద్-ఉన్-నబీని పురస్కరించుకుని శనివారం పురానీహవేలీలోని సౌత్‌జోన్ డిసిపి కార్యాలయంలో ముస్లిం మత ప్రముఖులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుకుండ అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను జరుపుకుని తమ సహకారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. ఖాద్రి ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షులు మౌలానా సయ్యద్ ఖాద్రి మాట్లాడుతూ మిలాద్-ఉన్-నబీని పురస్కరించుకుని పాతబస్తీలో పలు ముస్లిం మత సంస్థలు శాంతి ర్యాలీలు నిర్వహించనున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మన్న సిఎఆర్ హెడ్ కా ర్టర్స్ జాయింట్ సిపి కార్తికేయ, జాయింట్ సిపి ఎస్‌బి విశ్వప్రసాద్, సౌత్‌జోన్ డిసిపి పి.సాయి చైతన్య, టాస్ క్‌ఫోర్సు డిసిపి జి.చక్రవర్తి, డిసిపి ఒఎస్‌డి టిఎఎఫ్ రాధాక్రిష్ణ, ట్రాఫిక్ డిసిపి కరుణాకర్, డాక్టర్. హఫీజ్ ముజాఫర్, సయ్యద్ షా వసిం ఆలం, సయ్యద్ మహమూద్ అలీతో తో పాటు పలువురు ముస్లిం మత ప్రముఖులు పాల్గొన్నారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం జరగనున్న మిలాద్-ఉన్-నబీని పురస్కరించుకుని హైదరాబాద్ పాతబస్తీలో పలు ముస్లిం మత సంస్థలు శాంతి ర్యాలీలు ర్వహించనున్నాయి. చార్మినార్, మొగల్‌పుర, మీరాలంమండి, శాలిబండ, కాలాపత్తర్, కామాటిపుర, భవానీనగర్, కిషన్‌బాగ్ ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

అర్ధరాత్రి దాటినా..

అదే మోత

నగర పబ్‌లలో తెల్లవారుజాము వరకు డిజేల సౌండ్

రాత్రి సమయాల్లో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

నిర్వాహకులకు నేతలు, ఉన్నతాధికారుల అండదండలు

హైకోర్టు ఆదేశాలు, అధికారుల హెచ్చరికలు బేఖాతరు

నిబంధనలు పాటించని మూడు పబ్‌లపై కేసు నమోదు

హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త: నగరంలోని పబ్బుల వల్ల చిన్నాపెద్ద అందరూ ఇబ్బంది పడుతున్నా వాటి తీరు మారడం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తాం.. కోట్లు ఆర్జిస్తాం అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ప్రశ్నిస్తే బౌన్సర్లతో దాడులు.. అనుమతులు లేకుండా వేడుకల నిర్వాహణ, మైనర్లను అనుమతించడం.. రాత్రిళ్లు భారీ శబ్దాలతో డాన్సులు వంటివి కొనసాగిస్తున్నాయి. గతకొద్ది రోజుల క్రితం జూబ్లీహిల్స్‌లోని అమ్నేషియా పబ్‌లో జరిగిన పార్టీలో బాలిక పట్ల యువకులు అసభ్యంగా ప్రవర్తించడం ..కార్లో తీసుకెళ్ళి సామూహిక హత్యాచారం చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో హోమంత్రి, ఎక్సైజ్ శాఖమంత్రి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పబ్‌లను హెచ్చరించారు. హైకోర్టు సైతం రాత్రి 10దాటితే శబ్దకాలుష్యం ఉండొద్దని ఆదేశించింది. దీంతో కొద్దిరోజులపాటు నిబంధనలు పాటించినట్లు నటించిన పబ్ యాజ మాన్యాలు మళ్ళీ పాతపాటే పాడుతున్నాయి. అర్ధరాత్రి దాటినా డీజే సౌండ్లతో నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి. అయితే హైదరాబాద్‌లో 120వరకు పబ్‌లు ఉండగా అందులో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో అత్యధికంగా 40కిపైగా కొనసాగుతు న్నాయి. గడిచిన 6నెలల్లో శబ్దకా లుష్యం, సమయం పాటించకపోవడం వంటి కారణాలతో పోలీసులు 30కుపైగా కేసులు నమోదు చేసి ఎఫ్ఐఆర్ చేశారు. 60-70వరకు పెట్టీ కేసులు పెట్టారు. అయితే చట్టప్ర కారం ఇవన్నీ కేవలం జరిమానా చెల్లించే విధంగా ఉండటంతో వారు ఖాతరు చేయలేదు. **నిబంధనలు పాటించని మూడుపబ్‌లపై కేసులు..** నిబంధనలు ఉల్లంఘించిన మూడు పబ్‌లపై పోలీసులు కేసు నమో దు చేశారు. జూబ్లీహిల్స్‌లోని అమ్నీషి యా, ఎయిర్‌లైవ్, జీరో పార్ట్ పబ్బులపై కేసు నమోదు చేశారు. దీంతోపాటు ఆయా పబ్‌ల యజమాని, మేనేజర్లపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. రాత్రి 10గంటల కు దాటినా అధిక సౌండ్స్‌తో పరిసర ప్రాంత ప్రజలను ఇబ్బం దులకు గురిచేస్తున్నందున వీటిపై కేసు నమోదైనట్లు తెలుస్తుంది. ఈతరహా ఘటనలపై హైకోర్టు ఇప్పటికే ఆదేశాలు జీరీ చేసింది. ప బ్బుల్లో నిర్దిష్టమైన శబ్దాలు (సౌండ్స్) ఉండేలా చూసుకోవాలని , లేదంటే వారిపై కేసు నమోదు చేయొచ్చని పోలీసులను ఆదేశిం చింది. సిటీపోలీస్ యాక్ట్.. నాయిస్ పొల్యూషన్ రెగ్యూలరేషన్ ప్రకారం లౌడ్ స్పీకర్లకు నిర్దేశిత లిమిట్ వరకే అనుమతి ఉంటుం దని చెప్పింది. అయినప్పటికీ వాటిని బేకాతరు చేసిన పబ్‌లపై పోలీసులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది.

నిర్వాహకులకు నేతల అండదండలు.. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోని కీలక పబ్‌లన్నీ రాజకీయపార్టీల నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఆయా నేతల పేర్లు చెప్పి కిందిస్థాయి పోలీసులు, ఎక్సైజ్ అధికారులను నిర్వాహకులు బెదిరిస్తున్నారు. అలాగే మద్యం సరఫరా అనుమతులు ఒక ప్రాంతంలో తీసుకుని మరో ప్రాంతంలో సరఫరా చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ పేరిట అనుమతులు తీసుకునే పబ్‌లకు ఇండెంట్ ప్రకారం మద్యం సరఫరా చేస్తారు. కానీ ప్రభుత్వానికి నష్టం కలిగే విధంగా కొందరు నిర్వాహకులు బయటి నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

వ్యక్తులను గుర్తించి పురస్కారాలు అందించడం విశేషం

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్

చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త: వివిధ రంగాలకు చెం దిన వారిని గుర్తించి పురస్కారాలు అందించడం విశేషమని విశ్రాంత ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్ అన్నారు. ప్రముఖ గాయకుడు, శారదావరపుత్ర, ఎస్‌బిఐ పూర్వ ఉన్నతాధికారి చింతలపూడి త్రినాథరావుకు జీవిత సాఫల్య పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం శ్రీ శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమి అధినేత్రి, గాయనీ చిల్లా శివపార్వతి ఆధ్వర్యంలో శనివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. జీవిఆర్ ఆరాధన సంస్థ అధినేత గుదిబండి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ భవానీప్రసాద్ పురస్కా రాన్ని త్రినాథరావుకు అందించి గౌర వించారు. ఈ కార్యక్ర మంలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్దనమూర్తి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎస్‌వి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఆకాడమి అధినేత్రి, సంగీత గురువు, గాయనీ చిల్లా శివపార్వతి శిష్యబృందం నిర్వహించిన సంగీత విభావరి అందరిని అలరించింది.

రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్ మృతి తీరనిలోటు

గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 8ప్రభాతవార్త: టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా నాయకులు, రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్ ఎ.ఎం.చంద్రశేఖరావు ఆకాలమరణం తీరనిలోటని మాజీ డి.ఐ.జి స్టాంప్సు, రిజిస్ట్రేషన్ అధికారి సుబ్బారావు, హైదరాబాద్ జిల్లా టిఎన్ జిఓ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ, జనగాం సబ్‌రిజిస్ట్రార్ అంజద్‌అలీలు అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచిన విషయం తెలుసుకుని చంద్రశేఖర్‌రావు పార్థి దేహంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళ్లు ఆర్పించారు. ఈసందర్భంగా ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ టిఎన్‌జిఓ బలోపేతం కోసం ఎంతో తోడ్పాటు అందించినట్లు తెలిపారు. దాదాపు 30 సంవత్సరాల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతికలుగాలని కోరారు. ఆదివారం జరిగే అంతిమ యాత్రలో టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు, కార్యవర్గసభ్యులు పాల్గొనవల్సిందిగా కోరారు. టిఎన్‌జిఓ ప్రతినిధులు ఉమర్‌ఖాన్, ఖలీద్‌అహ్మద్, ఎం.ఏ.ముజీబ్, ఉస్మాన్‌అలీఉస్మాని, రోహిత్, నవీన్, శ్రీధర్‌నాయుడు, మహమ్మద్‌వహీద్, జహంగీర్, ముస్తాఫాచావుష్‌లు చంద్రశే ఖర్ పార్థిదేహంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళ్లు ఆర్పించారు.

తూకాల్లో దగా..

కిలో కొంటే వచ్చేది 850 గ్రాములే..

మాంసంలో మోసం

మాంస ప్రియులను ముంచుతున్న వ్యాపారులు

హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త: మాంసానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొంతమంది వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ మాంసంప్రియులను నట్టేటా ముంచుతున్నారు. అంతేకాకుం డా కొంత మంది అనారో గ్యంతో ఉన్న, చనిపోయిన మేకలు, గొర్రెలను తీసుకు వచ్చి వాటిని వధించి విక్ర యిస్తూ ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. గత కొంత కాలంగా జంట నగరాల్లోనిపలు ప్రాంతాల్లో మాంసం విక్రేతలు మోసాలకు పాల్పడుతున్నారు. మాంసం తూ కం వేయడానికి ఎలక్ట్రానిక్ తూకాలను (వేయింగ్ మిషన్) ఏర్పాటు చేసుకోవాలని తూనికలు కొలతల శాఖ అధికారులు ఆదేశిం చినా దుకాణాదారుల్లో చాలామంది మామూలు తూకాలు (తరాజు) వాడుతున్నారు. అలాగే తూకాల్లో బాట్లు నిర్ణీత గడువు ముగిసినప్పటికీ వాటిని కొత్తగాముద్రించి వాడటానికి దుకాణా దారులు ఆసక్తి చూపడంలేదు. మాంసం గిరాకీ ఎక్కువగా ఉండే ఆదివారం, పండుగరోజుల్లో ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. నగరంలో ఎక్కువ శాతం ఆదివారం రోజునే మాంసప్రియులు మాంసాన్ని కొనుగోలు చేస్తారు. ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు అందినకాడికి దోచుకుంటూ వినియోగదారుల ను మోసం చేస్తున్నారు. ఇటీవల తూనికలు కొలతల అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో గల చికెన్, మటన్, షిష్ షాపుల్లో విస్తృత దాడులు నిర్వహించగా మాంస వ్యాపారుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఎలక్ట్రానిక్ కాంటాపై తూకం వేసి కిలో(1000 గ్రాములు) మాంసం కొనుగోలు చేసిన ఓవినియోగదారుడుకి తన చేతికి అందే సరికి అది తక్కువగా కనుబడటంతో వేరొక కాంటాపై కొలిచిచూడగా అది 850గ్రాములుగానే కనబడింది. దీంతో ఆవినియోగదారుడు తాను తూక ంలో మోసపోయానని గుర్తించి తూనికలు కొలత అధికారలకు వాట్సప్ ద్వారా తెలియజేసాడు. దీంతో ఆమాంసం దుకాణాలపై అధి కారులు దాడులు నిర్వహిం చగా తూకాల్లో మోసాలకు పాల్పడుతు న్నట్లు తేలడంతో వారిపై కేసులు నమోదు చేసారు. ఇలా నగరంలోని చాలా దుకాణా ల్లోని వ్యాపారులు వినియోగ దారుల జేబులకు చిల్లుపెడుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాల్లో తక్కువ తూకం సెట్టింగ్ చేసి మోసాలకు పాల్పడుతు న్నారు. ఇటీవల నగరంలోని అంబర్‌పేట్, యూసఫ్‌గూడ, ఫలక్‌నుమా, సికింద్రాబాద్ ప్రాంతంలో తూనికలు కొలతల అధికారులు దాడులు నిర్వహించికేసులు నమోదు చేశారు. కిలో మాంసానికి 100గ్రాములు తక్కువగా తూకం వేస్తున్నట్లు గుర్తించారు. ఎలక్రానిక్ కాంటాపై 900గ్రాముల చికెన్ పెడితే 1000గ్రాములు ఉన్నట్లుగా డిస్‌ప్లేలో చూపిస్తుంది. ఆదే 1000గ్రాముల చికెన్ పెడితే 1100గ్రాములుగా చూపిస్తుంది. దీంతో ఆదుకాణదారుడు 100గ్రాములు ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు గుర్తిం చారు. 10కిలోల చికెన్‌కు కిలో చికెన్ తక్కువగా వస్తున్నట్లు పసి గట్టారు. దీంతో ఆదుకాణాలపై కేసులు నమోదు చేశారు. మరో ఆరుగురు దుకాణదారులు వేయింగ్ మెషన్‌లు రెన్యూవల్ చేయకుం డానే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. తూకంలో మోసాలకు పాల్పడు తున్నట్లు వినియోగదారులు తమదృష్టికి తీసుకురావాలని వ్యాపారులపై కఠిన చర్యలు తీసకుంటామని అధికారులు తెలుపుతున్నారు.

పదేండ్ల తర్వాత అమ్మ చెంతకి..

బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించిన అనంతరం..

మలక్‌పేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : ఇంటి నుంచి తప్పిపోయి పది సంవత్సరాల తర్వాత వచ్చిన ఒక బధిర (చెవిటి మూగ) బాలికను కుటుంబ సభ్యుల చెంతకు చేర్చిన ఘనత పిన్ ఆశ్రమ పాఠశాలకు దక్కింది. పిన్ ఆశ్రమ పాఠశాల కరస్పాండెంట్ బాలకృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. జువైనల్ హోమ్ (సిడబ్ల్యూసి) వారు దుర్గ (18) అనే అమ్మాయిని మలక్‌పేట్‌లోని పిన్ ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. ఆ బాలిక ప్రస్తుతం 8వ తరగతి చదువుతుంది. ఇలా ఉండగా బాలిక దుర్గ ఆధార్ కార్డు ఆధారంగా మెట్రో అధికారి భవానీ ప్రసాద్ వేలిముద్రలు తీసుకొని ఐరిష్ పరీక్ష చేయగా గతంలో ఆధార్ కార్డు ఉన్నట్టు గుర్తించి అమ్మాయిది శ్రీకాకుళం జిల్లా పలాస మం డలం పెద్దవంచెల గ్రామంగా గుర్తించారు. వెంటనే మెట్రో అధికారి భవానీప్రసాద్ ఆధార్ కార్డు ఆధారంగా ఆశ్రమ పాఠశాల నిర్వహ కులకు సమాచారం అందించి ఫోన్ నెంబర్‌కు కాల్ చేయగా వారి తల్లి నాగమణి నానమ్మ కాంతమ్మ శనివారం పిన్ ఆశ్రమ పాఠశాలకు వచ్చారు. ఎనిమిది సంవత్సరాల తర్వాత కనిపించిన తల్లి నానమ్మ ను కలిసి చూడగానే దుర్గ ఆమెను కౌగిలించుకొని ఆనందంతో ఆనం ద భాష్పాలు రాల్చారు. హైదరాబాదు సిడబ్ల్యుసి అధికారుల ఆదేశాల మేరకు పిన్ స్కూల్ డైరెక్టర్ జానకి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణారెడ్డి బాలికను అమ్మ నాన్నమ్మలకు అప్పగించారు. తమ బిడ్డను కన్న బిడ్డల తన మరమరాలిని ఎనిమిది సంవత్సరాల పాటు చూసుకున్న పిన్ ఆశ్రమ నిర్వాహకులకు నాగమణి కాంతమ్మలు ముఖిళిత హస్తాలతో అభినందనలు తెలిపారు. అమ్మ నానమ్మ ఆధారంగా ఉన్న దుర్గ దొరకడం సంతోషంగా ఉందని ఇప్పటికీ బాగా చదువుకుందని భవిష్యత్తులో మంచి ప్రయోజకురాలిని చేస్తామని నాగమణి కాంతమ్మలు తెలిపారు. పోలీసులు సిడబ్ల్యూసి అధికారుల సమక్షంలో అమ్మాయిని (యువతిని) కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పిన్ స్కూల్ సిబ్బంది బాలు, తుల సి, రాజు, మాధవి, మెట్రో అధికారి భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

దళితబంధు పథకాన్ని రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి అందించాలి

దళితబహుజన శ్రామిక యూనియన్(డిబిఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర మహాసభ

దళితబహుజన శ్రామిక యూనియన్ (డిబిఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర మహాసభలో ప్రసంగిస్తున్న ప్రతినిధులు

చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త: దళితబంధు పథకాన్ని రాష్ట్రంలోని ప్రతి దళితకుటుంబానికి అందించాలని దళితబహుజన శ్రామిక యూనియన్(డిబిఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో డిబిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర మహాసభలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నర్సింహా అధ్యక్షతన జరిగింది. బడ్జెట్‌లో ఉన్నత విద్యను అధిక నిధులు కేటాయించాలని, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు కేటాయింపులు పెంచి, యధావిధంగా కొనసాగించాలని, ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, దళితుల భూములను అభివృద్ధి చేయాలని, పనిదినాలు 100 రోజుల నుంచి 250 రోజులకు పెంచాలని, ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, ఏ సంవత్సరం నిధులు అదే సంవత్సరం ఖర్చు చేయాలని, ఇతర ప్రభుత్వ పథకాలకు దారి మళ్లించకూడదని, ఇది వరకే మళ్లించిన నిధులను తిరిగి జమచేయాలని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేసింది. భూపంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి భూమిలేని నిరుపేద కుటుంబాలకు మూడెకరాలు వ్యవసాయ యోగ్యమైన భూమిని వెంటనే పంపిణీ చేయాలని, దళిత బహుజనులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని, ఎస్సీ,ఎస్టీ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించకూడదని, అవసరమైతే భూమికి భూమి ఇవ్వాలని, ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం-1989, అమెండ్‌మెంట్స్ యాక్ట్-2016 ను పటిష్టంగా అమలు చేయాలని, తెలుగులో ముద్రించి విస్తృతప్రచారం చేయాలని, ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఫర్ గ్లోబల్ నెట్‌వర్క్ అకాడమి ప్రధాన కార్యదర్శి ఎన్.పాల్‌దివాకర్, దళితస్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డంఝాన్సీ, డిబిఎస్‌యు ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు, శాతవాహన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, యాక్షన్ ఎయిడ్ జీఎం ఆంజనేయులు, డిబిఎస్‌యు ప్రధాన కార్యదర్శి గండు నర్సింహా, డిబిఎఫ్ ప్రధాన కార్యదర్శి పి.శంకర్, ఎంఎస్ఎస్ అధ్యక్షుడు రాంప్రసాద్, ఆహ్వానకమిటీ ప్రతినిధులు ఎస్.శివలింగం, వై.మధు, సి.ఆనంద్, డి.శ్రీనివాస్, జె.రమేశ్, కె.నవీన్‌కుమార్, ఎ.చిన్నయ్య, కె.స్వరూప, కె.అమృత, కృష్ణవేణి, ఎల్.సాయిలు, రేపాకస్వామి, బి.జానయ్య, ఎం.అంజయ్య, బి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లలిత కళల ద్వారా సమాజంలో మార్పునకు కృషి చేస్తున్నాము

సంస్కార భారతి అఖిల భారత అధ్యక్షులు వాసుదేవ్ కామత్

నార్సింగి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : లలిత కళల ద్వారా సమాజంలో మార్పును తీసుకువచ్చేందుకు సంస్కార భారతి కృషి చేస్తుందని ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు వాసుదేవ్ కామత్ పేర్కొన్నారు. శనివారం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని శారదాధామంలో సంస్కార భారతి అఖిల భారతీయ సాధారణ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవ్ కామత్ మాట్లాడుతూ సంస్కార భారతిని 1981లో బాబా యోగేంద్రజీ ప్రారంభించారని వివరించారు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా 12.వందల శాఖలతో కొనసాగుతుందని తెలిపారు. ప్రతీ ఏడాది ఒక్కో రాష్ట్రంలో జాతీయ స్థాయి సభలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే ఈ సారి తెలంగాణలో ఈ సభలు జరుపుతున్నామని స్పష్టం చేశారు. ఈ సభల్లో గత ఏడాది తీసుకున్న నిర్ణయాలు ఏ మేరకు అమలు చేయబడ్డాయి? వాటి అమలులో ఏమైనా మార్పులు చేయాలా? ఫలవంతం అయ్యాయా? వంటి అంశాలపై పునశ్చరణ చేయడం జరిగిందన్నారు. అలాగే వచ్చే ఏడాది కాలం పాటు సంస్కార భారతి ఏవిధమైన పాత్రను పోషించాలి అన్న అంశాలపై జాతీయ స్థాయి నాయకత్వం అంతా కలిసి నిర్ణయాలు తీసుకుందన్నారు. భావిభారత పౌరులైన విద్యార్థులకు మనదైన సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనంను వివరించి, వారిచేత ఆచరింపజేసేందుకు సంస్కార భారతి విశేషంగా కృషి చేస్తుందన్నారు. అఖిల భారత సంఘటనా మంత్రి అభిజిత్ గోఖలే నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో సంస్కార భారతి ప్రతినిధులు సావంత్ రంజన్, అరుణ్ కుమార్, ప్రొఫోసర్ అనురాధ, జొన్నల గడ్డ గౌరి, శ్రీకళకృష్ణా, అశ్విని దావేలతో పాటు 300మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని శారదాధామంలో ఏర్పాటు చేసిన సంస్కార భారతి అఖిల భారతీయ సాధారణ సమావేశంలో ప్రసంగిస్తున్న జాతీయ అధ్యక్షులు వాసుదేవ్ కామత్

ఆత్మగౌరవ ఆశీర్వచనం దుగ్గిరాల ఆత్మీయ రంగస్థల పురస్కారం : డా. కె.వి.రమణాచారి

నాంపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త : ఈరోజు రంగస్థల రంగంలో 9 దశాబ్దాల వయస్సు దాటిన అత్యంత ప్రముఖులైన 3 నాట శిఖరాలున్నాయని, ఒకరు దుగ్గిరాల సోమేశ్వరరావు, మరొకరు జి.ఎస్.ఎన్.శాస్త్రి, మూడవవారు పొన్నాల రామసుబ్బారెడ్డిలున్నారని, ఇందులో 91 ప్రాయంలో ఉన్న దుగ్గిరాల సోమేశ్వరరావు ప్రఖ్యాత రంగస్థల నటుడు, దర్శకుడు, అన్నింటికిమించి గొప్పకవి, ప్రాతఃస్మరణీయుడని, ప్రతిష్టాత్మక ఎన్.టి.ఆర్ రంగస్థల, గురజాడ సాహితీ పురస్కారాలతోపాటు మరెన్నో పురస్కారాలు అందుకున్నారని, ఆయన జన్మదిన సందర్భంగా నాటక, కళారంగాల్లో విశేష సేవలందిస్తున్న నలుగురు ప్రముఖులకు ప్రదానం చేసిన దుగ్గిరాల ఆత్మీయ రంగస్థల పురస్కారం, పురస్కారంతోపాటు అందించినది 5వేల రూపాయలే అయినా 5లక్షలకుమించిన ఆత్మగౌరవ, ఆశీర్వచన పురస్కారమని శనివారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో డా. డి.విజయభాస్కర్ సభాధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. కె.వి.రమణాచారి అభివర్ణించారు. ఎప్పటికప్పుడు తన ఆలోచనలు, ఆశీస్సులు, ఆత్మీయతలను తనతో పంచుకుంటున్న సోమేశ్వరరావు తన పుట్టినరోజున హైదరాబాద్ నగరంలో 300కోట్ల పైచిలుకు ఆదాయమున్న 477మందికికన్నా మిన్నగా నలుగురు కళాసేవలకు రంగస్థల పురస్కారంతో సత్కరించుకొని మనఃస్ఫూర్తిగా 5వేల రూపాయల నగదు అందించడం ఆయన హృదయ వైశాల్యానికి నిదర్శనమని కొనియాడుతూ, నేడు దుగ్గిరాల ఆత్మీయ పురస్కార గ్రహీతలను అభినందించారు. డా. డి.విజయభాస్కర్ అధ్యక్షోపన్యాసంలో నాటక రంగంలో ఎన్నో అద్భుతమైన పాత్రలలో నటించి ఆయా పాత్రలకే ప్రాణంపోశారని, ఎన్నో నాటకాలను విశ్వవ్యాప్తం చేశారన్నారు. విశిష్ట అతిథి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లలితకళాపీఠాధిపతి డా. కోట్ల హనుమంతరావు దుగ్గిరాల సోమేశ్వరరావు నాటక గురువు, గొప్ప దర్శకుడు, రచయిత, ఎన్నో పరిశోధనలకు మూలపురుషుడన్నారు.

పురస్కారగ్రహీతలతో రమణాచారి, విజయభాస్కర్, హనుమంతరావు, శాస్త్రి తదితర అతిథులు

గంగపుత్రుల సమస్యల పరిష్కారం పట్ల మంత్రి కెటిఆర్ భరోసా

మంత్రి కెటిఆర్‌ను కలిసిన గంగపుత్ర సమన్వయ కమిటీ సభ్యులు

సికింద్రాబాద్, అక్టోబర్ 8 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గంగపుత్ర కుటుంబాం సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, వారి సమస్యలన్నిటికి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని ఐటీ, పురపాక శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. హైద్రాబాద్ ప్రగతి భవన్‌లో గంగపుత్ర సమన్వయ కమిటీ చైర్మన్ దీటీ మల్లయ్య, తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది దేశబోయిన రఘుల ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ బృందం మంత్రి కేటీఆర్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. నిజామాబాద్ జిల్లాలో ఐదు ఎరాల విస్తీర్ణంలో ప్రస్తుతమున్న కూరగాయల మార్కెట్ స్థానంలో ప్రత్యేక ఫిష్ మార్కెట్ ఏర్పాటు, వరంగల్ జిల్లా గంగపుత్ర హౌజింగ్ సొసైటీలో దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న గంగపుత్ర కుటుంబాలను గుర్తించి వారికి మూడు లక్షల నిధులు సమకూర్చాలని, గంగపుత్ర మత్స్యకార సహకార సొసైటీలకు సంబందించి ఇది వరకే జారీ చేసిన సర్క్యులర్ స్థానంలో ప్రత్యేక జీఓ విడుదల చేయాలనని చేసిన విజ్ఞప్తిలకు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యాక్రమంలో దేశబోయిన రఘు, కైరంకొండ యాదగిరి, పాక మధుసూదన్, నామాల శంకర్, ఇటికెల సతీష్, డోలి రాజలింగం, రాజేందర్ కుమార్, రాజేష్ ఖన్నా, నారాయణలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ భార్యభర్తలకు ఒకే జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న వివేక్

సైఫాబాద్, అక్టోబరు 8 ప్రభాతవార్త: ఒకే జిల్లాలో ఉపాధ్యాయ భార్యభర్తలకు ప్రభుత్వం పోస్టింగ్‌లు కల్పించాలని స్పౌస్ ఫోరమ్ విజ్ఞప్తి చేసింది. ఉపాధ్యాయుల బదిలీకి జారీ చేసిన జిఓ 317 వల్ల భార్యభర్తలు వెర్వేరు జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఫోరం ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం కన్వీనర్ వివేక్, కో-కన్వీనర్ ఖాదర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వేర్వేరు జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వడం భార్యభర్తలు వారు పిల్లలను, తల్లిదండ్రులను చూసుకోలేక పోతున్నారని, అంతే కాకుండా 100 నుంచి 300 కిలోమీటర్ల వరకు ప్రయాణించి అలసిపోతున్నారని, అంతేకాకుండా మానసిక వత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే జిల్లాలో భార్యభర్తలకు పోస్టింగ్స్ ఇవ్వాలని సిఎం కెసిఆర్ ఆదేశాలు జారీ చేసినప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికి 19 జిల్లాలలో బదిలీలు జరిగాయని, మిగిలిన 13 జిల్లాల్లో సిఎం ఆదేశాలను అధికారులు అమలు చేయకుండా నిర క్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. గత 9 నెలలుగా ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే అధికారులు స్పందించాలని, సిఎం కెసిఆర్ న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫోరం ప్రతినిధులు జానికిరాంరెడ్డి, ఆనందం, ప్రశాంత్, నాగరాజు, రాములు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా సాగిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త: సుబ్బు మ్యూజిక్ అకాడమి అధినేత, ప్రముఖ గాయకుడు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన 'ఈనాటి ఈబంధమేనాటిదో' పేరుతో నిర్వహించిచిన తెలుగు-హిందీ సినీ సంగీత విభావరి అందరిని అలరించింది. అలనాటి మేటి గాయనీ గాయకులు ఎస్‌పి.బాలు, ఘంటసాల, మహ్మద్ రఫీ, కిషోర్‌కుమార్, లతామంగేష్కర్, సుశీల, జానకీ పాడిన పాటలను శ్రీధరం రామసుబ్రహ్మణ్యంతో పాటు గాయనీ గాయకులు మురళీధర్, వి.ఎ.లక్ష్మి, ఏఎం.త్యాగరాజు, సూర్య, ఎంఎస్ఎన్.రావు, శ్రీనివాస్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు, రవికిషోర్, డాక్టర్ సంపత్‌కుమార్, అరుణ్‌కుమార్, ప్రవీణ్, సాయిరామ్, సత్యదీప్తి, శ్యామల, అనూష, దివ్యజ్యోతి, స్వప్న తదితరులు అద్భుతంగా గానం చేశారు.

గొలుసు దొంగను అరెస్టు చేసిన మియాపూర్ పోలీసులు

మూడు తులాల పుస్తెలతాడు స్వాధీనం

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ జోన్ డిసిపి

సైబరాబాద్ ప్రతినిధి, అక్టోబరు 8 ప్రభాతవార్త : ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెల తాడును తెంచుకొని బైకుపై పారారైన యువకున్ని పది రోజుల అనంతరం మియాపూర్ పోలీసులు అరెస్టుచేసి అతను దొంగలించిన మూడు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై శనివారం మాదాపూర్ డిసిపి శిల్పావలి విలేకరులకు వివరాలు వెల్లడించారు. కృష్ణాజిల్లా, గంపలగూడెం మండలం మేడూరు గ్రామానికి చెందిన మాలిసెట్టి నరేష్(35) గత 15 సంవత్సరాలుగా నగరంలోని రాంనగర్ ప్రాంతంలో నివాసముంటున్నాడు. గతంలో క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేసిన ఇతను జల్సాలకు అలవాటుపడి డబ్బులు సరిపోకపోవడంతో చిన్నచిన్న దొంగతనాలు చేస్తున్నాడు. 2011లో ఇతనిపై చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో మెబైల్‌ఫోన్ స్నాచింగ్ కేసు నమోదైంది. 2019లో ఇతనిపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లోనూ మరో కేసు నమోదైంది. కాగా ఇతను గతనెల 27వ తేదీన దొంగలించిన పల్సర్‌బైకుపై మియాపూర్‌కు వచ్చాడు. సదరు బైకును గుర్తించకుండా ఉండేందుకు నెంబరు మార్చి రెండు రోజులపాటు పలు కాలనీలలో తిరుగుతూ ఒంటరిగా వెళ్లే మహిళలకోసం వెతికాడు. రెండు రోజులపాటు బస్టాపుల్లోనే నిద్రిస్తూ ఇక్కడే మకాంవేసిన నరేష్ 29వ తేదీ మధ్యాహ్నం సమయంలో మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మయూరినగర్‌లో ఒక మహిళ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్నడి గమనించి బైకుపై ఆమెను వెంబడిస్తూ ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును తెంచుకొని పరార య్యాడు. పుస్తెలతాడును తెంచే సమయంలో సదరు మహిళ దాన్ని గట్టిగా పట్టుకోవడంతో కొంతభాగం ఆమె చేతిలోనే ఉండిపోయింది. ఈవిషయమై ఆమె మియాపూర్ పోలీసులకు సమాచారమందించగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తమకందిన విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం నిందితుడు నరేష్‌ను ఎస్ఆర్‌నగర్‌లోని సాన్వీ హాస్టల్‌లో అదుపులోకి తీసుకు న్నారు. పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితునివద్దనుంచి మూడు తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకొని శనివారం రిమాండుకు తరలించారు. కాగా జనసమ్మర్దం తక్కువగావుండే ప్రాంతాల్లో ఇలాంటి చైన్‌స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని, మహిళలు బంగారు ఆభరణాలతో నడుచుకుంటూ వెళ్లే సమయంలో తమ కొంగును మెడపై కప్పివుంచాలని డిసిపి తెలిపారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ప్రతి వీధిలో సిసికెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. నేరాలను అదుపుచేయడంలో సిసి కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఈకేసును చాలెంజ్‌గా తీసుకొని పదిరోజుల్లోనే నింది తున్ని అరెస్టుచేసిన మియాపూర్ పోలీసులను అభినందించి రివార్డులు అందించారు. ఈ సమావేశంలో మాదాపూర్ అడిషనల్ డిసిపి నంద్యాల నర్సింహారెడ్డి, మియాపూర్ ఎసిపి కృష్ణప్రసాద్,ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు, డిఐ కాంతారెడ్డి,డిఎస్ఐ జగదీశ్వర్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా ఫర్నీచర్‌ను

అందజేయడం అభినందనీయం : జంపనప్రతాప్

ప్రభుత్వ పాఠశాలలకు అందజేసేందుకు ఫర్నీచర్‌ను పరిశీలిస్తున్న జంపనప్రతాప్,సంస్థ చైర్మన్ మధుసూదన్ తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులు అరిగె రామస్వామి, చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ అరిగె మధుసూదన్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌లోని 18 ప్రభుత్వ పాఠశాలలకు తయారు చేస్తున్న ఫర్నీచర్‌ను శనివారం జంపనప్రతాప్,మధుసూదన్‌లు పరిశీలించారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ధర్నాచౌక్, అక్టోబర్ 8, ప్రభాతవార్త: సీపీఐ 24 వ జాతీయ మహాసభల సందర్భంగా ఈనెల 11న నిరుద్యోగ భారతం-నేటి యువత కర్తవ్యం అనే అంశంపై నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధర్మేంద్ర పిలుపునిచ్చారు. శనివారం హిమాయత్‌నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సదస్సు గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించటంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో నిరుద్యోగసైన్యం పెరిగిపోతున్న తరుణంలో ఏఐవైఎఫ్ నిరుద్యోగుల పక్షాన నిలబడి పోరాటం చేయనుందని, దానిలో భాగంగా రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ సి.కాశీం ప్రధాన వక్తగా హాజరవుతారని తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్.బాలకృష్ణ, నాయకులు మహమూద్, టి.సత్యప్రసాద్, రాకేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త: బాగ్‌లింగంపల్లి శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం నిర్మాణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షిరిడి సాయిబాబా ఆలయాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు నాగయ్యగౌడ్, సిరిగిరి కిరణ్, నేతా శ్రీనివాస్, మల్లేష్‌యాదవ్, నవీన్‌నాయక్, ప్రకాశ్‌రెడ్డి, సంతోష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీధర్‌రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 8, ప్రభాతవార్త : మేడ్చల్ మల్కాజగిరి జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా పాపిరెడ్డి నగర్‌కు చెందిన చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి, రెడ్డి జాగృతి అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డిల చేతులమీదుగా శ్రీధర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓసి సామాజిక వర్గంలో కూడా చాలా మంది నిరుపేదవారు ఉన్నారని వారికి పదిశాతం రిజర్వేషన్‌లో భాగంగా ఇడబ్ల్యూఎస్‌లో ఎలాంటి బేదం లేకుండా అందరికీ ఒకే పెర్సెంటేజ్ వుండేలా చూడాలని కోరారు. దీనికోసం నిరంతరం తనవంతుగా అందరితో కలిసి పల్గొంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్షులు, స్థానిక నాయకులు చిట్టిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఈరెడ్డి దేవేందర్‌రెడ్డి, దాకమొల్ల రాజనర్సింహారెడ్డి, ఏనుగు సబితారెడ్డి, వరపు సుజాతరెడ్డి, విక్రమ్‌రెడ్డి, మేకల నర్సింహారెడ్డి, కంటే సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి భక్తుడి విరాళం

షాద్‌నగర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త : చౌదమ్మగుట్ట ఆలయ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ స్వామి వారి భక్తులు సుబ్బయ్య, రాధాకుమారి దంపతులు ఆలయాభివృద్ధికి తమ వంతుగా రూ. 10,101 నగదును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కౌన్సిలర్ పులిమామిడి లతాశ్రీశైలంగౌడ్ దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆ భక్తుడిని పూలమాలతో ఘనంగా సన్మానించారు.

మంత్రిని కలిసిన కార్పొరేటర్

మంత్రిని ఆశీర్వదిస్తున్న పండితులు

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త : దసరా శరన్నవరాత్రులు, రావణ దహన కార్యక్రమాలు విజయవంతం అయిన సందర్భంగా రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను శనివారం సనత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, హనుమాన్ దేవస్థానం ఆలయ ఈవో శ్రీనివాస్‌రాజు, డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, ప్రధాన ఆర్చకులు పరుశురాం, రవీంద్రాచార్యులు మంత్రికి వేద మంత్రాలతో, ఆశీర్వచనాలతో పాటు ఆలయ ప్రసాదాలను అందజేశారు. కార్పోరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దసరా కార్యక్రమాలను విజయవంతం చేసిన సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గోకుల్ థియేటర్ ఆపోజిట్‌లైన్‌లో ఉన్న రోడ్డుకి ఈ నెల 30వ తేదీన కమాన్‌కు శంకుస్థాపన కార్యక్రమానికి రావలసిందిగా కార్పోరేటర్ మంత్రిని కోరారు. మంత్రి తప్పకుండా వస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రీపుంజయ్‌శర్మ, వెంకట్‌శర్మ, సూపర్వైజర్ శ్రీనివాస్, రాజేష్ ముదిరాజ్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

రేపు జర్నలిస్టుల డిమాండ్స్ డే

ఇండ్ల స్థలాల సమస్యల పరిష్కారానికై..

జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా

సైఫాబాద్, అక్టోబరు 8 ప్రభాతవార్త: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటి ప్రకటించింది. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వవచ్చంటూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని ఫెడరేషన్ తెలిపింది. గత 35 సంవత్సరాలుగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా ఇండ్లు, ఇళ్ళస్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య డిమాండ్ చేశారు. 10న ఇళ్ళ స్థలాల కోసం, బస్‌పాస్‌లు, టోల్‌గేట్ సమస్య, జర్నలిస్టు బంధు, రైల్వే పాసులపై అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించాలని వారు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మానసిక వికాస ప్రదాతలు పుస్తకాలు

తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

రవీంద్రభారతి, అక్టోబరు 8 ప్రభాతవార్త : విద్య, విజ్ఞానం, వికాసం, వినోదంతోపాటు మానసిక వికాస ప్రదాతలుగా పుస్తకాలు ఎంతగానో తోడ్పడుతాయని తెలంగాణ రాష్ట్ర బి.సి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, సాంస్కృతిక, సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఉజ్వల సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు సత్యనారాయణ యాదవ్ (సతీష్) పర్యవేక్షణలో రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో బైసా దేవదాసు సభాధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. వి.కృష్ణమోహన్‌రావు విశిష్ట అతిథులు ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, డా. ఎం.కె.రాము, విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, డా. శ్రీధర్‌రావు, టి.నరేష్, డా. కావూరి శ్రీనివాస్, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కె.రాధిక, ఎం.లక్ష్మీ తదితరులతో కలిసి ప్రముఖ రచయిత కోట శ్రీరామమూర్తి రచించిన గీతామకరందము పుస్తకాన్ని ఆవిష్కరించగా డా. ఎం.కె.రాము విజ్ఞానదీపిక పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం వకుళాభరణం మాట్లాడుతూ శ్రీరామమూర్తి రచించిన గీతామకరందములో శ్లోకాలను అందరికీ అర్థమయ్యేరీతిలో సరళమైన భాషలో అద్భుతంగా వివరించారని కొనియాడారు. మామిడి హరికృష్ణ ప్రారంభోపన్యాసం కావించగా సభకుముందు చిన్నారుల నృత్యప్రదర్శనలు విచ్చేసిన అశేష ప్రేక్షకులను ఆకట్టుకొని ఎంతగానో అలరించాయి.

రహదారిపై గుర్తు తెలియని మృతదేహం

అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 8ప్రభాతవార్త: రహదారిపై పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని సుల్తాన్‌బజార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఎస్.ఐ మధుసూధన్ కథనం ప్రకారం.. ఈనెల 6వ తేదిన చాదర్‌ఘాట్‌లోని విక్టరీప్లేగ్రౌండ్ వద్ద సుమారు 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది పడి ఉన్నాడు. విషయం తెలుసు కున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహానికి శవపంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి అనారోగ్యంతో బాధపడుతూ మరణించి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఈకేసును సుల్తాన్‌బజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బెంగాలీల సమస్యల పరిష్కారం కోసం కృషి : హోంశాఖ మంత్రి మహమూద్ అలీ

హోంశాఖ మంత్రి మహమూద్ అలీని కలిసిన టిఆర్ఎస్ నాయకులు

చార్మినార్,అక్టోబరు 8 ప్రభాతవార్త : రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీని శనివారం తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు, సీనియర్ టిఆర్ఎస్ నాయకులు దీపాంకర్ పాల్‌ఆధ్వర్యంలో పలువురు నాయకులు,సమితి ప్రతినిధులు కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ బెంగాలీల సమస్యలను పరిష్కరించటానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు టిఆర్ఎస్ నాయకులు,సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారు నడిపి డివైడర్‌ను ఢీకొట్టారు

సైబరాబాద్ ప్రతినిధి, అక్టోబరు 8 ప్రభాతవార్త : పీకలదాకా మద్యం సేవించిన నలుగురు యువకులు కారులో వెళ్తూ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి గాయాలపాలైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్ తెలిపిన ప్రకారం ఈఘటన వివరాలు ఇలావున్నాయి. శ్రీనగర్‌కాలనీకి చెందిన టి.కార్తీక్ (29) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను తన కారు(టిఎస్11ఇఎమ్5858)లో ముగ్గురు స్నేహితులు మహేష్(23),సాగర్‌రెడ్డి(23),వినయ్‌కుమార్(23

నార్సింగిలో మౌలిక వసతుల కల్పనకే తొలి ప్రాధాన్యత

నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్

నార్సింగి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకే తొలి ప్రాధాన్యతనిస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీలో కౌన్సిలర్ అరుణజ్యోతి యాదవ్‌తో కలిసి రూ.15లక్షలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజి పనులను వెంకటేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా మౌలిక వసతులైన మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, అంతర్గత రోడ్లు, కల్వర్టులు, కాలువల నిర్మాణం వంటి వాటి కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెడుతున్నామని వివరించారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులు తెలుసుకొని పరిష్కరించాలని సిఎం కేసీఆర్ ఆదేశించారని, ప్రజా ప్రతినిధులమంతా ఇక నుంచి ప్రజా క్షేత్రంలోనే ఉంటామని తెలిపారు. ఏ ప్రాంతంలో ఏ చిన్న సమస్య ఉన్నా స్థానిక కౌన్సిలర్లకు తెలుపాలని, వారు స్పందించకుంటే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. నిత్యం ప్రజల మధ్యన ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే వారికే ఆ ప్రజలు ఎన్నికల వేళ అండగా నిలుస్తారని పేర్కొన్నారు. నార్సింగిని వేగంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అభివీద్ధి పనులు చేస్తున్నామని, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని వెంకటేష్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాజ్ కుమార్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా పేదలకు చేయూతనిస్తోంది

ప్రభుత్వవిప్ గాంధీ

లబ్ధిదారులకు ఆసరా కార్డులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వవిప్ గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 8, ప్రభాతవార్త : ఆసరా ఫించన్ పథకాన్ని ప్రవేశపెట్టి నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం ఆసరాగా నిలుస్తుందని ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ డబ్బులు వచ్చిన సందర్భంగా లబ్ధిదారులు శనివారం ప్రభుత్వవిప్ గాంధీని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆసరా ఫించన్ల పథకం చాలా గొప్పదని, ఆసరా ఫించన్ల గుర్తింపు కార్డులు పొందిన వారి బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ కావడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక సంక్షేమ పథకాలతో అలరారిస్తూ ప్రజా సంక్షేమ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. కులమత ప్రాంత, పార్టీలకతీతంగా అర్హులైన అందరికీ ఆసరా ఫించన్లు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ మహిళా సమాఖ్య ప్రెసిడెంట్ మంజుల తెరాస నాయకులు మధు, లాలూనాయక్, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మశక్తిని, శారీరకశక్తిని పెంపొందించేలా కరాటే నేర్చుకోవాలి

జడ్జ్ బూర్గుల మధుసూదన్

అమృతారెడ్డికి 'దసరా పురస్కారం' అందించిన దృశ్యం

హైదరాబాద్ అక్టోబరు 8 ప్రభాతవార్త: జ్యోతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా విశ్రాంత జడ్జ్ బూర్గుల మధుసూదన్ హాజరై జీవిఆర్ కరాటే అకాడమి విద్యార్థి, వండర్‌బుక్ ఆఫ్ రికార్డుగ్రహీత జి.అమృతారెడ్డికి 'దసరా పురస్కారం' అందించి గౌరవించారు. మహిళలు ఆత్మశక్తిని, శారీరకశక్తిని పెంపొందించేలా కరాటే నేర్చుకోవాలని, కరాటే ఆత్మరక్షణకు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. అలాంటి కరాటేలో నైపుణ్యంతో పాటు ఎన్నో సాహస ప్రదర్శనలు చేసి ప్రపంచ రికార్డులు సాధించిన అమృతకు పురస్కారాం అందించడం సముచితమని జడ్జ్ బూర్గుల మధుసూదన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రముఖ సంఘసేవకులు జస్వంత్ భాయ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

ఘట్‌కేసర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మున్సిపల్ 17వ వార్డులో శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. బాలాజీనగర్‌కు చెందిన వల్లెపు సునీత అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా బిల్లు అధికం కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి ధరఖాస్తు చేసుకుంది. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ద్వారా సీఎం ఆర్ఎఫ్ నుంచి రూ.25,000లు మంజూరు అయ్యాయి. ఈమేరకు స్థానిక కౌన్సిలర్ బేతాల నర్సింగ్‌రావు చేతుల మీదుగా సునీతకు సిఎం ఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో మైసమ్మగుట్ట ఆలయ డైరక్టర్ బర్ల సరోజ, మున్సిపల్ టిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షులు బర్ల హరిశంకర్, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వేల్పుల మంజుల, ఉపాధ్యక్షులు సగ్గ కమలమ్మ, 17వ వార్డు పార్టీ అధ్యక్షురాలు మెహ్రాజ్ (తబస్సుమ్), మహిళా అధ్యక్షురాలు వాకిటి లత, నాయకులు ఎండి.సిరాజ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి మంత్రి అండ

కీసర,అక్టోబర్8,ప్రభాతవార్త : ప్రతి పేద కుటుంబానికి మంత్రి మల్లారెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ అన్నారు.శనివారం కీసరలో ఈ మధ్య కాలంలో చనిపోయిన చిలుక రమేష్,తుడం పాపమ్మ కుటుంబాలకు మంత్రి మల్లారెడ్డి ట్రస్టు ద్వారా ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి తన సొంత నిధులతో పేద కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు.ప్రతి పేద కుటుంబానికి మంత్రి మల్లారెడ్డి అండగా నిలబడుతానని హామీ ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి,ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్‌శర్మ,వార్డు సభ్యులు రామారం ప్రదీప్,మండల మీడియా అధ్యక్షులు గోరంటి ప్రవీణ్,మాజీ ఎంపిపి రామారం సుజాత,యూత్ అధ్యక్షులు మెట్టు పరమేష్ యాదవ్,ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన మహేష్,బీసి సెల్ అధ్యక్షులు మంత్రాల వెంకటేష్,నాయకులు మెట్టు సతీష్,మధు,తుడుం శ్రీనివాస్,రాగుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుచేసిన లారీని దొంగలించిన ఇద్దరు అరెస్ట్

సైబరాబాద్ ప్రతినిధి, అక్టోబరు 8 ప్రభాతవార్త : కాలనీలో పార్కుచేసిన లారీని దొంగలించిన ఇద్దరు పాతనేరస్తులను మియాపూర్ పోలీసులు అరెస్టుచేశారు. ఈమేరకు మాదాపూర్ జోన్ డిసిపి శిల్పావళి శనివారం డిసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దుండిగల్‌కు చెందిన నార్ల మల్లేశ్(32) కూలీపని చేసుకునేవాడు. ఇతనికి మియాపూర్ న్యూకాలనీకి చెందిన ముడావత్‌శ్రీను(32)తో పరిచయం ఏర్పడింది. గత నాలుగేళ్లుగా ఇద్దరూ కలిసి జల్సాలు చేస్తూ డబ్బు చాలకపోవడంతో దొంగతనాలు చెయ్యాలని నిర్ణయించుకున్నారు. మియాపూర్ న్యూకాలనీలో ప్రతినిత్యం ఒక లారీ(ఎపి23వి6673)పార్కుచేసి ఉండటాన్ని గమనించిన శ్రీను విషయాన్ని మల్లేశ్‌కు చేరవేశాడు. లారీ డ్రైవరు లారీ తాళంచెవిని లారీకే వదిలేసి వెళ్లడాన్ని గమనించిన వీరు ఈనెల ఒకటవ తేదీ రాత్రి సమయంలో సదరు లారీని దొంగలించుకొని పరార్యాయారు. అనంతరం సదరు లారీని రహస్యప్రాంతంలో వుంచి విక్రయించేందుకు యత్నిస్తుండగా బాధితుని ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు నిందితులను శనివారం అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల విచారణలో నిందితులు నిజం ఒప్పుకోగా లారీని స్వాధీనం చేసుకున్నారు. అయితే పాతనేరస్తుడైన నార్ల మల్లేశ్‌పై దుండిగల్, జీడిమెట్ల, రాజేంద్రనగర్, శామీర్‌పేట్ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 11దొంగతనం కేసులు నమోదైవున్నాయని డిసిపి తెలిపారు. నిందితుని వేలిముంద్రల ఆధారంగా అతను చేసిన దొంగతనాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. వాహనాలు పార్కుచేసే విషయంలో యజమానులు, డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాన్ని ఒకరోజుకు మించి ఒకేచోట పార్కుచేయ్యకూడదని తెలిపారు. ఈకేసును చాలెంజ్‌గా తీసుకొని వారం రోజుల్లోనే నిందితులను అరెస్టుచేసిన మియాపూర్ పోలీసులను అభినందించి రివార్డులు అందించారు. సమావేశంలో మాదాపూర్ అడిషనల్ డిసిపి నంద్యాల నర్సింహారెడ్డి, మియాపూర్ ఎసిపి కృష్ణప్రసాద్,ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు, డిఐ కాంతారెడ్డి,డిఎస్ఐ జగదీశ్వర్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు వీఆర్ఏల ధర్నా

కొడంగల్,అక్టోబర్ 8ప్రభాతవార్త : వీఆర్ఏల నిరవధిక సమ్మెలో భాగంగా వీఆర్ఏ జేఏసీ పిలుపు మేరకు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు వీఆర్ఏలు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య,వీఆర్ఏ జేఏసీ జిల్లా కోకన్వీనర్ గోపాల్‌లు మాట్లాడుతు చాలీచాలనీ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడం విచారకరమన్నారు.గత 76 రోజులుగా సమ్మే చేపడుతున్నా ప్రభుత్వం నమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. దసరా పండుగ సందర్భంగా సీఎం కేసీఆర్ వీఆర్ఏలకు తీపి కబురు అందిస్తారని ఆశించినా ప్రభుత్వం నుంచి ఏలాంటి చలనం లేదన్నారు.సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్న వీఆర్ఏల్లో ఇదివరకు 50మందికి పైగా వీఆర్ఏలు మృతిచెందడం జరిగిందన్నారు.అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ నిండు సభలో ప్రకటించిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.చర్చల పేరుతో ఇదివరకు రెండు సార్లు వీఆర్ఏల జేఏసీ నాయకులతో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ హామీలు నేటికి నెరవేర్చక పోవడం సమంజసం కాదన్నారు.అసెంబ్లీలో సీఎం ఇచ్చిన హామీలను తక్షణమే జీఓలు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.కాగా వీఆర్ఏల ధర్నా సందర్భంగా తహశీల్దార్ ముందు గల మహబుబ్‌నగర్-తాండూర్ రోడ్డుపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంబించింది.దీంతో ఎస్సై రవి పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని ధర్నా చేస్తున్న వీఆర్ఏలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సంగీత సాహిత్యం సమస్థాయిలో సంగమం ఐతే మంచి పాటకు పునాది

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త

గాయనీ గాయకులను సత్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త: సంగీత సాహిత్యం సమస్థాయిలో సంగమం ఐతే మంచి పాటకు పునాది అవుతుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో చంద్రహాస్ సంగమం పేరిట సంగీత దర్శకుడు మణిశర్మ స్వరరచన చేసిన సినీగీతాలాపన కార్యక్రమం జరిగింది. రోహిణి చంద్రహాస్‌తో పాటు గాయనీ గాయకులు గంగాధర్ తదితరులు పాటలను పాడారు. మోహనకృష్ణ వ్యాఖ్యానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త హాజరై గాయనీ గాయకులను సత్కరించారు. నాడు ఘంటసాల తదుపరి తరంలో బాలసుబ్రహ్మణ్యం తెలుగు పాటలను సుసంపన్నం చేశారన్నారు. ఆ ఇరువురు ధృవతరాలు ఆలపించిన పాటలను నేటితరం వారు వేదికలపై పాడుతూ వారి మధుర స్మృతులను నిలుపుతున్నారన్నారు. రచయిత రామచంద్రమూర్తి గాయనీ లక్ష్మి, ఎల్‌పి.రావు, సంతోష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు ఉప ఎన్నికల సమావేశం

మునుగోడు ఉప ఎన్నికలకు తరలివెళ్లిన కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని గెలిపించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జరిగిన సమావేశానికి మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు. బిజెపి ముఖ్య నేతలు వివేక్, ప్రకాశ్ రెడ్డిలతో సమావేశమైయ్యారు.

కార్గేను కలిసిన నాయకులు

ఏఐసిసి నేత మల్లికార్జున్ కార్గేను అభినందిస్తున్న ఆదం సంతోష్ కుమార్ తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న మల్లికార్జున్ కార్గేను శనివారం టీపిసిసి ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి పాల్గొన్నారు.

మున్నూరు కాపు కులస్థుల ఐక్యత కోసం పాటుపడాలి

మున్నూరు కాపు సంఘం సర్వసభ సమావేశంలో పాల్గొన్న గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆర్వీమహేందర్‌కుమార్

బేగంబజార్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: తెలంగాణ మున్నూరు కాపు సంఘం సర్వసభ సమావేశంలో గ్రేటర్‌హైదరాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆర్వీమహేందర్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు కులస్థుల ఐక్యత కోసం పాటుపడాలన్నారు.గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన టిడిపి నాయకులు

ఘట్‌కేసర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అశోక్‌రెడ్డిని శనివారం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఘట్‌కేసర్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేముల సంజీవగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు సీఐని కలిసి శాలువాతో సన్మానించారు. రాజకీయపార్టీల నాయకులు ఏలాంటి గొడవలకు తావులేకుండా తమ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఏదైనా సమస్య ఉంటే సమాచారం ఇవ్వాలని సీఐ పేర్కొన్నారు.

పేదలు సిఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కీసర, అక్టోబర్ 8, ప్రభాతవార్త : నిరుపేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ నాగాయపల్లి సుజాత శ్రీనివాస్ అన్నారు.మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప కాలనీలో నివాసం ఉండే అన్‌సారి గుల్‌శానారాకి శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు కొండంత అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుంద న్నారు. సీఎం సహాయనిధి ద్వారా ఎంతో మంది పేద ప్రజలు లబ్ది పొందుతున్నా రన్నారు.పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటాదన్నారు.ప్రజల క్షేమమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని,పేద ప్రజలకు భరోసానిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు.పేద సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు.నిరుపేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. అనారోగ్యం కారణాలతో ఎవరైనా ఇబ్బందులు పడితే శాయశక్తులా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాల పట్ల మొగ్గు చూపాలి

బిజెపి నేత గజ్జల యోగానంద్

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న యోగానంద్

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 8, ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల పట్ల దృష్టి సారించాలని శేరిలింగంపల్లి బిజెపి ఇంచార్జీ గజ్జల యోగానంద పిలుపునిచ్చారు. శనివారం ఉదయం 8గంటలకు వివినగర్ డివిజన్‌లోని చిత్తారమ్మ టెంపుల్లో అమ్మవారి పూజా కార్యక్రమంలో యోగానంద్ పాల్గొన్నారు. అనంతరం 9గంటలకు కూకట్‌పల్లి పార్ట్ 2 డివిజన్ పాపిరెడ్డినగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తదనంతరం ఎల్లమ్మబండలో మెడికల్ హెల్త్ క్యాంప్ వంటి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే జివై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన, నేత్ర పరీక్ష, ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు భగవంతుడు తనకు మరింత అవకాశం ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో శేరిలింగంపల్లి ప్రజలకు తాను సేవ చేసేందుకు అవకాశం కల్పించాలని భగవంతుణ్ణి కోరుకున్నట్లు తెలిపారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

షాబాద్, అక్టోబర్ 8, ప్రభాతవార్త : ఇక త్వరలో 5జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని సైబర్ మోసగాళ్ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.... సైబర్ మోసగాళ్లు అమాయకుల ఖాతాలు కొల్లగొట్టేందుకు ఏదారి వదలట్లేదు. 4జీ నుండి 5జీ మారండి అంటూ మీ ఫోన్ మేసెజ్ లేదా లింక్ వచ్చిందా, ఓటీపీ చెప్పండి అని....తొందర పడి క్లిక్ చేయకండి.... ఇదే అదునుగా తీసుకుని సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. మీరు 5జీ సేవలు పొందాలంటే 5జీ మరియు లీ సపోర్టు చేసి ఫోన్ ఉండాలి అంతేకానీ లింకులు, యాప్స్, ఓటీపీలు కాదని, వీరి మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శాంతి, భద్రతల పరిరక్షణకు సహకరించాలి

ఘట్‌కేసర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త: సమాజంలో శాంతి, భద్ర తల పరిరక్షణకు ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాల ని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ వి.అశోక్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు వి.హనుమాన్ ఆధ్వర్యంలో శనివారం నూతన ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డిని నాయకులు మరా్యద పూర్వకంగా కలిశారు.

హోంమంత్రి మహమూద్ అలీకి గాంధీ శాంతి పురస్కారం

రవీంద్రభారతి, అక్టోబరు 8 ప్రభాతవార్త : జాతిపిత పూజ్య బాపూజీ కన్నకలలు నిజంచేసేందుకు గాంధీజీ సత్య ధర్మ శాంతి అహింస మార్గాలలో పయనిస్తూ తెలంగాణ శాంతిభద్రతలను కాపాడుతూ తెలంగాణ రాష్ట్రానికి మణికిరీటంగా వెలుగొందుతున్న అజాతశత్రువు, స్నేహశీలి రాష్ట్ర ఆంతరంగిక వ్యవహారాలశాఖ మంత్రి మహ్మద్ మహ్మూద్‌అలీకి శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్, తిరుమల బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధానమందిరంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో మహాత్మాగాంధీ శాంతి స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహక సంస్థల అధిపతులు సీల్‌వెల్ సీఎండి బండారు సుబ్బారావు, శృతిలయ ఛైర్మన్ డా. బి.భీమ్‌రెడ్డి, తిరుమల బ్యాంక్ వి.చంద్రశేఖర్‌లు విలేకరులకు తెలియజేశారు. గతంలో ఈ పురస్కారాన్ని ప్రముఖులు కొణిజేటి రోశయ్య, డా. సి.నారాయణరెడ్డి, కె.విశ్వనాథ్, సిరికొండ మధుసూదనాచారిలను ప్రదానం చేసినట్లు వారు గుర్తుచేశారు. సిరికొండ మధుసూదనాచారి సభాధ్యక్షతన ఈ నెల 12 బుధవారం మధ్యాహ్నం 1నుండి రాత్రి 10గంటల వరకు జరిగే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని విశిష్ట అతిథులు కోలేటి దామోదర్‌గుప్తా, నంగునూరి చంద్రశేఖర్, యాదగిరి, ఎంఎ రహీమ్, సీనియర్ పాత్రికేయుడు మహ్మద్‌రఫీ, డా. కుసుమ భోగరాజు, టి.రామకృష్ణ, ఎం.శివకుమార్, ప్రముఖ గాయని, శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని తదితరులతో కలిసి రాష్ట్ర హోంశాఖమంత్రి మహ్మూద్ అలీని ఘనంగా సత్కరించి మహాత్మాగాంధీ శాంతిస్ఫూర్తి పుర స్కారం-2022ను ప్రదానం చేస్తారని వారు వివరించారు. సభకుముందు, సభానంతరం సీల్‌వెల్ సినీసుస్వరాలు-25 శీర్షికన ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో వర్ధమాన గాయకులు ఆణిముత్యాల్లాంటి తెలుగు, హిందీ సినీగీతాలను ఆలపిస్తారని, అధికసంఖ్యలో సినీసం గీత ప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుబ్బారావు, భీమ్‌రెడ్డి, ఆమని, చంద్రశేఖర్‌లు కోరారు.

జిల్లాలో కొనసాగుతున్న ఆసరా ఫించన్ల పంపిణీ

.ప్రస్తుతం 1లక్షా2వేల232మందికి

ప్రతి నెల 23కోట్ల రూపాయలు పంపిణీ

కొత్తగ 48,558 మందికి మంజూరు

ప్రతి నెల 10.8కోట్ల రూపాయల పంపిణీకి శ్రీకారం

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైనం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 8, ప్రభాతవార్త : జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో ఆసరా ఫించన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ప్రస్తుతం లక్షా 2వేల 232మందికి ఆసరా ఫించన్లు పంపిణీ జరుగుతూ వీరికి ప్రతి నెలా 23కోట్ల రూపాయలు ఆసరా ఫించన్లు పంపిణీ చేయటం జరుగుతుంది. వృద్యాప్య (26,261మంది), వితంతు (50,681మంది),చేనేత కార్మికులు (135మంది), గీతకార్మికులు (396మంది), బీడికార్మికులు (169మంది), ఒంటరి మహిళలు (5,193మంది),బోధకాలు (లేరు),ఆ లబ్దిదారులు ఆసరా ఫించన్లు పొందుతున్నారు. అయితే ప్రతి నెల 2,016రూపాయల చొప్పున ఆసరా ఫించన్లు తెలంగాణ ప్రభుత్వం నుంచి లబ్దిదారులు పొందుతున్నారు. ఇక వికలాంగులు (19,397మంది) కూడ ప్రతి నెల 3,016రూపాయల చొప్పున ఆసరా ఫించన్లు పొందుతున్నారు. అయితే గత మూడేళ్ల నుంచి ధరఖాస్తులు చేసుకుని పెండింగ్‌లో ఉన్నవారికి, 57ఏళ్లు నిండిన వారికి కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం ఆసరా ఫించన్లు జిల్లాకు సంబంధించి 48,558 మందికి కొత్తగ మంజూరు చేయటం జరిగింది. వీరికి ప్రతి నెల 10.8కోట్ల రూపాయలు పంపిణీ చేయటం జరుగుతుంది. కొత్తగ మంజూరు అయిన వాటిలో వృద్యాప్య (36,047మంది), వితంతు (8,761మంది), చేనేత కార్మికులు (4మంది), గీతకార్మికులు (54మంది), బీడికార్మికులు (లేరు),ఒంటరి మహిళలు (718మంది), బోదకాలు (62మంది)కి ఆసరా ఫించన్లు మంజూరు జరిగి పంపిణీకి శ్రీకారం చుట్టటం జరుగుతుంది. జిల్లాలో మండలాల వారీగ పరిశీలిస్తే ప్రస్తుత పించన్లు ఘట్‌కేసర్ మండలానికి సంబంధించి 2,634మంది, కీసర మండలంలో 2,319మంది, మేడ్చల్ మండలంలో 3,437మంది, మూడుచింతలపల్లి మండలంలో 2,560మంది, శామీర్‌పేట మండలంలో 3,035మంది ప్రస్తుతం ఆసరా ఫించన్లు పొందుతున్నారు. ఇక కొత్తగా ఘట్‌కేసర్ మండలానికి 924మందికి, కీసర మండలానికి 949మందికి, మేడ్చల్ మండలానికి 757మందికి, మూడుచింతలపల్లి మండలానికి 738మందికి, శామీర్‌పేట మండలానికి 900మందికి కొత్తగా ఫించన్లు మంజూరు కావటం జరిగింది. ఆసరా ఫించన్ల లబ్దిదారులు అందరికి ఫించన్ కార్డులను కూడ ప్రభుత్వం పంపిణీ చేయటం జరిగింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, పేదరికం నుంచి బయటపడటానికి, జీవనోపాధులు పెంపొందించుటకు గ్రామీణ ప

రామంతాపూర్ చిన్న చెరువులో కలుషిత వ్యర్థాలు..! స్థానికుల ఆందోళన : తొలగించాలని డిమాండ్

చిన్న చెరువులో వ్యర్థాలు తొలగించాలని ఆందోళన చేస్తున్న స్థానికులు

రామంతాపూర్, అక్టోబరు 8 ప్రభాతవార్త : రామంతాపూర్ చిన్న చెరువు కలుషిత వ్యర్థాలతో నిండిపోతోంది. ఇటీవల వరుస పండుగలు రావడం, వినాయక విగ్రహాలతోపాటు, అమ్మవారి విగ్రహాలు, ఇతర పూజా సామాగ్రి చెరువులోనే వేయడంతో చెరువులో వ్యర్థాలు నిండిపోతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ పెద్ద చెరువుకు అనుబంధంగా చిన్న చెరువు ఏర్పడింది. చిన్న చెరువులోకి వచ్చే నీరు కింద ఉన్న కాలనీల ద్వారా మూసీ నాలలోకి వెళ్లి కలిసేది. ప్రతి ఏటా ఎన్నికల సమయంలో చెరువును అభివృద్ధి చేస్తామని పాలకులు హామీలు ఇవ్వడం, అధికారులు హడావిడిగా పనులు చేపట్టినట్లు హడివిడి చేసి వెళ్లిపోవడంతో చెరువు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. చిన్న చెరువు చుట్టూ అనేక కాలనీలు వెలిసిపోవడంతో చెరువులోనే చెత్తాచెదారం వేస్తున్నారు. వ్యర్థాలు తీసుకుని వచ్చి చెరువులో వేసి వెళుతున్నారు. చెరువును పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన డిఆర్ఎఫ్ సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో చెరువు కలుషితంగా తయారైంది.చెరువు సమీపంలో కూడా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారులు స్పందించి చెరువులో వ్యర్థాలు తొలగించి చెరువును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరె కటిక సూర్యవంశి సంఘం అభివృద్ధికి కృషి : చెకొలేకార్

సమావేశంలో ప్రసంగిస్తున్న చెకొలేకార్ శ్రీనివాస్

మలక్‌పేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : ఆరె కటిక సూర్య వంశి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని టిపిసిసి అధికార ప్రతినిధి చెకొలేకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సలీంనగర్ పార్కులో ఆరె కటిక సూర్య వంశి సంఘం అలయ్ భలయ్ కార్యక్రమాన్ని చెకొలేకార్ ఆధ్వర్యలోఓ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరెకటికటలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్‌రావు, రమేష్‌కుమార్, నర్సింగ్‌రావు, అశోక్‌కుమార్, దయానంద్, రాజు, వెంకటేష్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో యువ వ్యాపారవేత్తల సదస్సు

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపల్ డా.సల్లారం నరసింహారెడ్డి తదితరులు

ఉప్పల్, అక్టోబరు 8 ప్రభాతవార్త : రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం విద్యార్థులంతా కలిసి యువ వ్యాపారవేత్తల సమావేశం నిర్వహించారు. పాఠశాల స్వర్ణోత్సవాలలో భాగంగా తొమ్మిది నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులను భాగస్వాములు చేస్తూ యువ వ్యాపారవేత్తల సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు బృందాలుగా ఏర్పడ్డారు. కళాకృతి, వెండిట్, ఖేయాస్, హెల్త్ కిచెన్, గోప్లే అనే పేర్లతో సమావేశంలో పాల్గొని వివిధ అంశాలను ఎంచుకుని వ్యాపారవేత్త విధులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కొడివిటి రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఉపాధ్యక్షుడు శంన్‌రామసహాయం, ఎస్. వెంకటేష్, ఆరోరా లైప్ సైన్స్ సభ్యులు రాజేందర్‌రావు జువ్వాడి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన కళాకృతి బృందం విద్యార్థులకు ప్రిన్సిపల్ సల్లారం నరసింహారెడ్డి ట్రోఫీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు యువ వ్యాపారవేత్తలుగా గొప్పస్థాయిలో నిలువాలని ఆకాంక్షించారు. అనంతరం సొసైటీ కోశాధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బాలజీవితంలో యువ వ్యాపారవేత్తలకు చేయూత అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి అశ్విన్, కిరణ్ పంజ్వాని, మాధవి, స్వర్ణలత, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి : మారుతి

మలక్‌పేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని టిఎస్ఆర్‌టిసి పోర్టర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.మారుతి పేర్కొన్నారు. పలువురు లైసెన్స్ పోర్టర్స్ దసరా పండుగను పురస్కరించుకుని మారుతిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టర్లకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీనిచ్చారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం

అమ్మవారిని ఊరేగిస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : మలక్‌పేట శ్రీ పోచమ్మ దేవాలయంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని మలక్‌పేటలోని పలు ప్రాంతాల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు పిటి శంకర్ ముదిరాజ్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి సురేష్‌కుమార్‌లు మాట్లాడుతూ ఏటా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌ముదిరాజ్, టిన్నుసింగ్, వెంకటేష్, నరేంద్ర ముదిరాజ్, చౌకి రాజు, హరీష్‌భాయ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో రోడ్ల అధ్వాన్న పరిస్థితిపై కాలనీవాసుల వినూత్న నిరసన

వినూత్న నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీవాసులు

సరూర్‌నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో రోడ్ల దుస్థితికి నిరసనగా స్థానికులు అధ్వాన్న రోడ్లపై ప్ల కార్డులను ప్రదర్శించారు. కాలనీలో గత రెండు సంవత్సరాల నుండి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకునే నాధుడే లేకపోవడంతో ఆగ్రహించిన స్థానికులు నిరసనకు దిగారు. పైప్‌లైన్ల ఏర్పాటుకు అడ్డగోలుగా రోడ్లను తవ్వినా వాటికి మరమ్మతులు గానీ కొత్త రోడ్లు గాని నిర్మించక పోవడంతో అవి దారుణంగా తయారవడంతో స్థానిక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో కాలనీవాసులు ప్రత్యక్ష నిరసనకు దిగారు. ఈ మేరకు కాలనీలో దారుణంగా తయారైన రోడ్లపై ప్ల కార్డులను ప్రదర్శించారు. మా రోడ్లను బాగు చేయండి అంటూ వారు కాలనీ రహదారులపై ప్ల కార్డులను పెట్టారు. కాలనీవాసుల వినూత్న నిరసనకైనా రోడ్లు బాగు పడుతాయో లేదో వేచి చూడాల్సిందే.

ప్రేరణ సంస్థ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సంచార జాతులకు సరుకుల అందజేత

సంచార జాతుల పిల్లలకు సరుకులు అందజేస్తున్న ఇంజనీర్ గిరి తదితరులు

రామంతాపూర్, అక్టోబరు 8 ప్రభాతవార్త : రామంతాపూర్‌లో నివసిస్తున్న సంచార జాతుల చిన్నారులకు ప్రేరణ సంస్థ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేయూత అందించారు. ఇంజనీర్ గిరి విజ్ఞప్తి మేరకు లయన్ శివకుమార్ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా పలుప్రాంతాల్లో నివసిస్తున్న మిఠాయిలు, బిస్కెట్లు, గోదుమ పిండి, ఇతర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇంజనీర్ గిరి, లయన్ రఘురామిరెడ్డి, ప్రకాష్, ఉపేందర్ తదితరులు మాట్లాడుతూ సంచార జాతులకు చేయూత అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సూచించారు. పేదల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రేరణ ప్రతినిధులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు : ఉప్పల

బాపురాజు చిత్రపటం ధన్యవాదాలు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఎల్.బి.నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త : విభిన్న సాహితీ ప్రక్రియలలో విశేషంగా రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు అని తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. నాగోల్‌లోని ఉప్పల క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆకృతి ఆధ్వర్యంలో సాహితీ వేత్త అడవి బాపిరాజు 127వ జయంతి సందర్భంగా ఆయన పటానికి పూలమాలలు వేసి ఉప్పల నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తెలుగు ఇంటిలో ప్రతిధ్వనించే బావాబావా పన్నీరు పాట ఆయన వ్రాసిందే అన్నారు. రచయిత, నాటకకర్త, పత్రికా సంపాదకుడు, చిత్రకారుడిగా ఆయన ఎంతో గుర్తింపు పొందారన్నారు. సినిమాలకు కళా దర్శకుడుగా కూడా ఆయన పని చేయడం ఎంతో ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారుడు కొట్టె వెంకటచారి, సందీప్‌రెడ్డి, శంకర్‌యాదవ్, నరసింహాయాదవ్, నవీన్‌కుమార్, రత్నం పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి.. సార్

ప్రధాన రోడ్డుపై వాహనాల రద్దీ ప్రమాదాల బారిన పాదచారులు

తుర్కయంజాల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త : తుర్కయంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో రోడ్డు దాటడానికి పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చౌరస్తాలో రోడ్డు దాటడానికి యూటర్న్ ఉండడంతో చౌరస్తాలో వాహనాలు మలుపులు తిరుగుతున్నప్పుడు ప్రమాదాలు జరుగుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు యూ టర్న్ మూసివేసి దిమ్మెలను ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యాలయానికి దుకాణాలకు వెళ్లే పాదాచార్యులు దిమ్మలపై నుంచి రోడ్డును దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకసారి రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు బారిన పడుతున్నారు.

నిత్యం ప్రమాదాలు.... ఇబ్రహీంపట్నం రూటుకు వెళ్లాలన్నా లేదా హైదరాబాద్ రూట్‌కు వెళ్లాలంటే రోడ్డు దాటాల్సిందే. వృద్ధులు స్టూడెంట్స్ కాలనీ వాసులు కానీ రోడ్డు దాటుతున్న క్రమంలో వాహనాలు రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రతిరోజు ఎవరో ఒకరు వాహనాలు ఢీకొనే ప్రమాదాలు గాయాల పాలవుతున్నారు. ఒక్కొక్కసారి ప్రాణాలుకూడా కోల్పోతున్నారు. నిత్య మున్సిపాలిటీ కార్యాలయానికి ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు పోతుంటారు. కార్యాలయానికి వెళ్లే సమయంలో రోడ్డు దాటాలంటే వాహనాలు అతివేగంగా వస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నయని ప్రజలు హడలి పోతున్నారు. అదేవిధంగా చౌరస్తా లో రోడ్డుపైనే లేబర్ అడ్డా ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు చౌరస్తాలో లేబర్ 400 మంది పైగా లేబర్ అడ్డా ఉండడంతో రోడ్డు దాటాలంటే ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ ట్రాఫిక్ సమస్యలతో 108 వాహనం వెళ్తున్న దారిదిరకడం లేదు. ఇటువంటి సమయంలో ప్రాణం కోల్పోవాల్సిందేనా అనే సానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదాలను నివారించాలంటే చౌరస్తాలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే పాదాచారులకు ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

వాహనాల రద్దీతో రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్న పాదచారులు

రోడ్డు దాటాలంటే భయం భయంగా ఉంటుంది... పండ్ల వ్యాపారి లక్ష్మమ్మ

తుర్కయంజాల్‌లో పండ్ల వ్యాపారం చేసుకుంటున్న సింధుల లక్ష్మమ్మ నిత్యం హైదరాబాదులోని మాదన్నపేట మండికి వెళ్లి పండ్లు తీసుకురావాల్సి వస్తుంది. తుర్కయంజాల్‌లోని మా దుకాణానికి వెళ్లాలంటే చౌరస్తాలో బస్సు దిగి రోడ్డు దాటాల్సి వస్తుంది. వాహనాల రద్దీ తీవ్రంగా ఉండడంతో పండ్లు తీసుకొని రోడ్డు దాటడం చాలా భయంగా ఉంటుంది. చౌరస్తాలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుందని, ప్రమాదాలు కూడా తగ్గుతాయని తెలిపారు.

మాతృదేవోభవలో మానసిక వికలాంగులకు అన్నదానం

సరూర్‌నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. తన కుమారుడైన స్వర్గీయ పెద్దబావి మహేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఆశ్రమంలో అనాథలకు, మానసిక వికలాంగులకు విశేష అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దబావి పుష్పలత, పెద్దబావి మధుకర్‌రెడ్డి,మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, పుట్టగళ్ళ జగన్, సామ వరుణ్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, వసంత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ సంచలనం అవుతుంది: కామేష్‌రెడ్డి

జిల్లెలగూడలో సంబరాలు చేస్తున్న అర్కల కామేష్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: సిఎం కెసిఆర్ చేతుల మీదుగా విజయ దశమి రోజున అవిష్కరించిన భారత రాష్ట్రీ ట్రీయ సమితి పార్టీ దేశంలోనే సంచలనం అవుతుందని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి అన్నారు. టిఆర్ఎస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీగా మార్పు అయిన సందర్భంగా కార్పొరేషన్‌లో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కామేష్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ రాజకీయాల్లో బిఆర్ఎస్ ప్రభంజనం సృష్టిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్, మామిడి సుదర్శన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, యాదగిరి, సుభాష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో బోటు సౌకర్యం

ఉప్పల్, అక్టోబరు 8 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో సందర్శకులకు ఆహ్లాదాన్నిపంచేందుకు బోటు సౌకర్యం ఏర్పాటు చేశారు. దసరా పండుగ సందర్భంగా మినీ శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి.కిషన్‌రావు బోటింగ్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్భగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిల్పారామంకు వచ్చే సందర్శకులు బోటింగ్‌ను ఆస్వాదించ వచ్చని తెలిపారు. శిల్పారామంలో సందర్శకుల కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఝాన్సీరాణి శిష్య బృందంచే కూడిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు,ఇ తర సిబ్బంది పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో బోటులో విహారం చేస్తున్న సందర్శకులు

బిజెపిలో చేరిన లింగాల హరిగౌడ్

లింగాల హరిగౌడ్‌కు కండువా కప్పుతున్న బండి సంజయ్

సరూర్‌నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు లింగాల హరిగౌడ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. సైదాబాద్‌నుండి భారీ ర్యాలీగా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలివెళ్లి ఆయన బిజెపిలో చేరారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు పోరాటం : రెడ్డి జాగృతి

రెడ్డి జాగృతి రాష్ట్ర సమావేశంలో పాల్గొన్న బి.మాధవరెడ్డి తదితరులు

ఉప్పల్, అక్టోబరు 8 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని మేకల భారతి గార్డెన్‌లో రెడ్డి జాగృతి రాష్ట్ర కమిటి పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రెడ్డి జాగృతి అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టంగారి మాధవరెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్ ఉప ఎన్నికల్లో సిఎం కెసిఆర్ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. దీనికి నిరసనగా మునుగోడు ఎన్నికల్లో రెడ్డి జాగృతి పక్షాన వేలాది మందితో నామినేషన్లు వేయాలని తీర్మానించినట్లు తెలిపారు. అదే విధంగా ఈడబ్ల్యూఎస్, ఎస్ఐ,కానిస్టేబుల్ ఉద్యోగాలలో పూర్తి స్థాయిలో ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదిన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు, ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలని వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు. 11వ తేదిన మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండల కేంద్రంలో ప్లకార్డులతో మౌన ప్రదర్శన ఉంటుందని, 12వ తేదిన రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి చూడి లింగారెడ్డి, సూర్యపేట జిల్లా అధ్యక్షుడు సూరకంటి నర్సిరెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్షులు కుక్కుటం వసంతరెడ్డి, దేవుడు నరసింహారెడ్డి, చిగిరి సతీష్‌రెడ్డి, గడ్డం మహిపాల్‌రెడ్డి, సుజాతరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గాదె సైదిరెడ్డి, మేక సోమిరెడ్డి, రావుల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ చౌరస్తాలో ఫ్లైఓవర్ల నిర్మాణంతో ట్రాఫిక్ కష్టాలు..!

ట్రాఫిక్ సుడిగుండంలో ఉప్పల్‌వాసులు : నత్తనడకన నిర్మాణ పనులు

ఉప్పల్, అక్టోబరు 8 ప్రభాతవార్త : ఉప్పల్‌చౌరస్తాలో ఒకేసారి చేపట్టిన మూడు ఫ్లైఓవర్ల నిర్మాణం కారణంగా వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్‌తోపాటు, ఉప్పల్ చౌరస్తాలో సుమారు రూ.37 కోట్ల వ్యయంతో స్కైవాక్ నిర్మాణ పనులు చేపట్టారు. అదే విధంగా ఉప్పల్ నుంచి ఎల్‌బినగర్ వైపు మరో ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఒకేసారి చేపట్టిన ఫ్లైఓవర్ల కారణంగా ఉప్పల్‌చౌరస్తాలో ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నారపల్లి నుంచి ఉప్పల్ వరకు సుమారు 6.25 కి.మీటర్ల పరిధిలో ఎన్ఆర్ డిపి కింద ఆర్‌అండ్‌బి అధికారులు రూ.675 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. వీటిని గాయత్రి కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు దక్కించుకుంది. మొదటి రెండేళ్లు పనులు హడావిడి గా చేసిన కాంట్రాక్టర్లు భూసేకరణ ఆలస్యం కావడంతో పనులు మధ్యలోనే నిలిపివేశారు. మొత్తం 148 పిల్లర్లతో 45 మీటర్ల వెడల్పు, ఆరు లైన్ల రహదారితో కొత్త కారిడార్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే నారపల్లి నుంచి ఉప్పల్ నల్ల చెరువు వరకు పిల్లర్లు వేసిన కాంట్రాక్టర్లు ఇంత వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం లేదు. కేవలం కి.మీ వరకే బ్రిడ్జి పనులు పూర్తి చేయగా, మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. పీర్జాదిగూడ, బోడుప్పల్ నుంచి నల్లచెరువు వరకు జాతీయ రహదారిని పలు చోట్ల తవ్వి వదిలివేయడంతో గుంతల మయంగా మారిపోయింది. ఈ రహదారిపై ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఈ ఏడాది చివరి నాటిని పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇంకా సగం పనులు కూడా పూర్తి కాకపోవడం గమన్హారం. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై అధికారులు కూడా అంతగా శ్రద్ధ తీసుకోవడం లేదని, పనుల నిర్లక్ష్యంగా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నత్తనడక సాగుతున్న స్కైవాక్ పనులతో అవస్థలు : ఉప్పల్‌చౌరస్తాలో సుమారు రూ.37 కోట్ల వ్యయంతో హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ స్కైవాక్ నిర్మాణ పనులతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. పాదచారులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఏడాది క్రితం ప్రారంభించిన స్కైవాక్ బ్రిడ్జి పనులు ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి అనుసంధానం చేస్తూ వరంగల్, రామంతాపూర్ రహదారులను కలుపుతూ నిర్మిస్తున్నారు. సుమారు 660 మీటర్ల ఉన్న స్కైవాక్ బ్రిడ్జి చుట్టూ నాలుగు వైపులా పాదచారులు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి నాలుగు వైపులా ఉన్న రోడ్ల వైపు నేరుగా వెళ్లేందుకు ఈ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఇప్పటికే స్కైవాక్ నిర్మాణం కోసం పలుచోట్ల పిల్లర్లు నిర్మించారు. నాగోల్ వైపు బ్రిడ్జి నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. వరంగల్, హబ్సిగూడనుంచి వచ్చే దారిలో ప్రధాన ఫిల్లర్ల పనులు సాగుతున్నాయి. స్కైవాక్ నిర్మాణంతో రోడ్డుమధ్యలోనే పిల్లర్లు వస్తున్నాయి. దీని కారణంగా పలు చోట్ల గుంతలు తవ్వి వదిలివేశారు. ట్రాఫిక్ అంతరాయంలేకుండా రాత్రివేళ పనులు చేపట్టాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యం గా పనులు చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ ముందు పిల్లర్ల వేసి రోడ్డు వేయకుండా వదిలివేశారు.

రామంతాపూర్ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ కోసం రోడ్డు మధ్యలో గుంతలు తవ్విన దృశ్యం.

ట్రాఫిక్ సుడిగుండంలో ఉప్పల్‌వాసులు :

ఉప్పల్‌చౌరస్తా మీదుగా వరంగల్, యాదాద్రి, ఎల్‌బినగర్ తదితర ప్రాంతాల కు నిత్యం వేలాది వాహనదారులు ప్రయాణలు చేస్తుంటారు. అయితే చౌరస్తాలో ఒక వైపు ఆర్టీసీ బస్ బస్టాప్‌లు, మరోవైపు పుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో ట్రాపిక్ కష్టాలు తప్పడం లేదు. ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు, స్కైవాక్ పనులు సాగుతుండగా, హబ్సిగూడ నుంచి నాగోల్ రహదారిలో మరో ఫ్లైఓవర్ నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారు. నిత్యం పోలీసులు సైతం ఈ రహదారిలో ట్రాఫిక్ నిలువరించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పనులు త్వరగా పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉప్పల్ చౌరస్తాలో స్కైవే నిర్మాణం కోసం పిల్లర్లు వేసి అసంపూర్తిగా వదిలివేసిన దృశ్యం.

ఉప్పల్ నుంచి రామంతాపూర్ రహదారిలో కొనసాగుతున్న కారిడార్ పనులు దృశ్యం.